

ఆటో అన్నా.. సంక్షేమం సున్నా



అల్లిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తాం.. ఈపీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం.. పెరిగిన ఇంధన ధరలు తగ్గిస్తాం.. అంటూ హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా తమను పట్టించుకోవట్లేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. పైగా కొత్త జీవోల పేరిట ఆర్టీఏ, పోలీస్ దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ట్యాక్స్‌లు.. జరిమానాలు..

కేంద్ర ప్రభుత్వం అపరాధ రుసుముల సవరణ పేరిట విడుదల చేసిన ఉత్తర్వులతో ఆటో డ్రైవర్లు బెంబేలెత్తుతున్నారు. దీని అమలు విచక్షణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించినా.. మన రాష్ట్రంలో మాత్రం ఆర్టీఏ, పోలీస్ శాఖలకు ప్రత్యేక ఆదేశాల పేరిట తనిఖీలు ముమ్మరం చేశారు. భారీ అపరాధ రుసుములు విధిస్తున్నారని ఆటోడ్రైవర్లు ఆక్షేపిస్తున్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ముందుకు రాని ప్రభుత్వం, తమపై భారం వేయడంలో మాత్రం వెనుకంజ వేయట్లేదని చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ట్యాక్స్‌లు విపరీతంగా పెంచడమే కాకుండా డీజిల్, పెట్రోలు ధరలూ భారంగా మారాయి. రవాణా శాఖ అధికారులు చీటికీ మాటికీ రాంగ్ పార్కింగ్, సిగ్నల్ జంపింగ్ పేరిట అధిక జరిమానాలు విధిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఆటోలను నమ్ముకుని జీవనం సాగించడం కష్టంగా ఉందని పలువురు ఆటో కార్మికులు వాపోతున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..

తమకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీగా ఇచ్చిన ఏడాదికి రూ.15 వేలు వాహన మిత్ర వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు. జరిమానాలను పెంచే జీవో నంబర్లు 21,31 రద్దు చేయాలని, డీజిల్, పెట్రోలు ధరలను జీఎస్టీ పరిధి లోకి తీసుకురావాలని, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను 30 శాతానికి తగ్గించాలని కోరుతున్నారు.



ఆటోడ్రైవర్‌కు ఒకేసారి వేసిన రూ. 7 వేల చలానా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగింది..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.10 వేలు ఆటో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. ప్రమాదవశాత్తు ఆటో కార్మికుడు మరణిస్తే ప్రమాద బీమా వర్తింపజేసి, వారి కుటుంబాలకు అండగా నిలిచేది. ప్రస్తుత ప్రభుత్వం ఆటో కార్మికుల కష్టాలను పట్టించుకోవడం లేదు. పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబాలను నెట్టుకు రావడం కష్టంగా ఉంది.

– జి. గణేష్, ఆటో డ్రైవర్, రైల్వే స్టేషన్

ఫైనాన్స్ కట్టలేక అవస్థలు..



ఆయిల్ ధరలతో పాటు నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో రోజంతా కష్టపడి ఆటో నడిపితే ఖర్చులు పోనూ.. మిగిలేవి రెండు మూడు వందలు మాత్రమే. ఆటో కొనుగోలుకు తీసుకున్న ఫైనాన్స్‌లకు నెలవారీ ఈఎంఐలు కట్టలేక సతమతమవుతున్నాం. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల భారం అదనం. రవాణా, పోలీస్ అధికారుల తనిఖీలు, జరిమానాలతో తలకు మించిన భారమవుతోంది.

– వై.వెంకట్, ఆటో డ్రైవర్, ఆర్‌ఎంఎస్ ఆటో స్టాండ్ అధ్యక్షుడు

కుటుంబ పోషణ కష్టం..



పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. రోజంతా కష్టపడి ఆటో నడిపితే వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి కొనుగోలు చేసిన ఆటో రుణాలు, పెరిగిన ట్యాక్సులు చెల్లించలేక సతమతమవుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి.

– అప్పలరాజు, ఆటో డ్రైవర్

ఆటో కార్మికులను ఆదుకోవాలి..



కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. మోటారు రంగంపై మోసిన ట్యాక్స్‌ల భారం తగ్గించాలి. ఏదో వంకతో ఆటో, ట్యాక్సీలపై చీటికీ మాటికీ జరిమానాలు విధించడం అన్యాయం. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన ట్యాక్సులు చెల్లించలేక, ఆటోలు నడపలేక అమ్ముకోవాలని చూస్తున్నాం. పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు తగ్గించాలి.

– రాజు, ఆటో డ్రైవర్

చంద్రబాబు ఎన్నికల హామీలు నెరవేర్చాలి..



ఆటో, మోటారు కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. ఆటోలు, ప్రైవేట్ మోటారు వాహనాలపై ఉన్న పాత పోలీస్, ఆర్టీవో, ఈ చలానాలు రద్దు చేయాలి. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి. పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాన్ని నెట్టుకు రాలేకపోతున్నాం.

– జి.వామనమూర్తి, కార్యదర్శి, ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్

క్లుప్తంగా

'మే డేను సెలవు దినంగా ప్రకటించాలి'

అల్లిపురం: ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడేను సెలవు దినంగా ప్రకటించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1886 మే 1వ తేదీన చికాగోలో ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని కార్మికులు మహా ప్రదర్శన జరిపారని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు జార్జ్ చక్రవర్తి కార్మికులపై తుపాకీ గుళ్ల కురిపించినట్లు తెలిపారు. అయినా వెనుకడుగు వేయని కార్మికులు కనీస వేతనం, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రాణాలర్పించారన్నారు. అలా సాధించిన 8 గంటల పని విధానాన్ని నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ 16 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మహాసంఘ్ ఉపాధ్యక్షుడిగా గోపాలకృష్ణ



దాబాగార్డెన్స్: భారతీయ పోర్ట్, డాక్ మజ్దూర్ మహాసంఘ్ (బీఎంఎస్) ఉపాధ్యక్షుడిగా కేఎస్‌వీ గోపాలకృష్ణ పట్నాయక్ ఎన్నికయ్యారు. గత నెలలో ఒడిశా పారాదీప్‌లో నిర్వహించిన సమావేశంలో కొత్త పాలక వర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు ఈ నెల 19న నూతనంగా ఎన్నికైన పాలకవర్గ వివరాల్ని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు న్యూఢిల్లీలోని పోర్టు, షిప్పింగ్ మంత్రి శరబానంద సోనోవాల్‌కు తెలియజేశారు. 11 మంది సభ్యులున్న కొత్త కార్యవర్గంలో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రాయ్, కార్యదర్శిగా సురేష్ కమలాకర్ పాటిల్ వ్యవహరించగా, మిగిలిన 9 మంది సభ్యుల్లో గోపాలకృష్ణ పట్నాయక్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్టు సురేష్ కమలాకర్ పాటిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ పోర్టులోని ట్రాఫిక్ విభాగ రైల్వే కమర్షియల్ సెక్షన్‌లో గూడ్స్ సూపర్‌వైజర్‌గా గోపాలకృష్ణ పట్నాయక్ పని చేస్తున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన ఆయన అంతర్జాతీయ స్థాయిలో హాకీ అంపైర్‌గా కూడా సేవలందించారు. ఈ మేరకు బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, ఏపీ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, కోశాధికారి లాలం ప్రసాద్, విశాఖ బీఎంఎస్ అధ్యక్షుడు రొక్కం సురేష్, పోర్టు బీఎంఎస్ గౌరవ అధ్యక్షుడు భవానీ శంకరుడు అభినందనలు తెలిపారు.


వేదం పరమాత్మ స్వరూపం



ఘనాపాఠీలు, క్రమాపాఠీలతో ఆలయ సిబ్బంది, భక్తులు

అల్లిపురం: వేదం పరమాత్మ స్వరూపమని టీటీడీ అధర్వణ వేద పండితులు, శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి సేవా సదన్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ అక్కాజోస్యుల రమేష్ శర్మ అన్నారు. అస్సాంగార్డెన్స్, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థాన ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు, దేవదాయ శాఖ, శ్రీ శివరామకృష్ణ దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి సహకారంతో టీటీడీ ప్రతినిధి గొల్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠీ ఆదేశానుసారం గత మూడు రోజులుగా లోక కల్యాణార్థం సంపూర్ణ చతుర్వేద పారాయణం జరిగింది. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి 15 మంది వేదపండితులు పాల్గొని ముక్తకంఠంతో చతుర్వేద పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులను, ఘనా పాఠీలను, క్రమా పాఠీలను సాంప్రదాయరీతిలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు భార్గవ శర్మ, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది మన్మథరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరారైన నిందితుని కోసం గాలింపు



నిందితుడు పూడి వంశీ

అల్లిపురం: సెంట్రల్ జైలు నుంచి కోర్టుకు నిందితులను తరలిస్తున్న సమయంలో శుక్రవారం పూడి వంశీ అనే ఖైదీ ఎస్కార్ట్ నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు నిందితుని కోసం గాలిస్తున్నారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతి అందజేయనున్నట్లు సీఐ యర్రం నాయుడు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 7981674667, 9010101620 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు.

చిరస్మరణీయుడు భానోజీరావు



భానోజీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్ భానోజీరావు తదితరులు

దాబాగార్డెన్స్: విద్య, సేవ, రాజకీయ, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందించిన ఏవీ భానోజీరావు చిరస్మరణీయుడని ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు కొనియాడారు. విద్యావేత్త, రాజకీయవేత్త భానోజీరావు వర్ధంతి కార్యక్రమం శనివారం ఏవీఎన్ కళాశాలలో నిర్వహించారు. ముందుగా కళాశాలలో గల భానోజీరావు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అదీప్ భానోజీరావు మాట్లాడుతూ జమీందార్ కుటుంబంలో జన్మించి, సామాన్య ప్రజలతో మమేకమై, విశాఖ జిల్లా అభివృద్ధికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి, కళాశాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఏయూ ఏర్పాటుకు తనకున్న భూముల్లో ఉన్న 3వ వంతు వాటాను విరాళంగా ఇచ్చిన గొప్పదాతగా ఆయన పేరొందారని, కేజీహెచ్‌కు భూమి ఇచ్చింది కూడా ఆయనేనన్నారు. తాటిపూడి జలాలు విశాఖకు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారన్నారు. అలాగే విశాఖలో హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనకు వాల్‌చంద్, హీరాచంద్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలే కారణమన్నారు. గరుడ పట్టాభిరామయ్య అనే షిప్పింగ్ ఏజెన్సీ ప్రారంభించి ఎన్నో కుటుంబాలకు వెలుగునిచ్చారని చెప్పారు. 1955–1972 వరకు ఎమ్మెల్యేగా, 1930–1938, 1951–1958, 1960–1962 మధ్య విశాఖపట్నం మున్సిపల్ చైర్మన్‌గా నగర ప్రజలు, రాష్ట్ర ప్రజలకు విశేష సేవలందించారన్నారు. 1962–65 వరకు ప్రొటెం స్పీకర్‌గా, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి శాఖ చైర్మన్‌గా ఉంటూ హంగేరి, జపాన్, టోక్యోలో జరిగిన ఎక్స్‌పో–70లో పాల్గొని రాష్ట్రాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించారన్నారు. సీతారామస్వామి ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా ఉంటూ ఆధ్యాత్మిక సేవా రంగంలో మరింత ప్రగతి సాధించి, టీటీడీ బోర్డు సభ్యునిగా స్వామికి వజ్ర కిరీటం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, శ్రీనివాస్, ఇందిర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడిని డిప్యూటీ సీఎం ఖండించాలి



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

దాబాగార్డెన్స్: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో దళితులపై దాడిని ఖండించాలని విశాఖ జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్ చేసింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లామ్ గ్రామంలో దళితుల బహిష్కరణను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో శనివారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు వై. రాజు మాట్లాడుతూ సాక్షాత్ గబ్బర్ సింగ్ నియోజవర్గంలో ఇంత ఘోరం జరగడం సిగ్గు చేటన్నారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా స్పందించకపోవడం పవన్ కల్యాణ్ దళిత వ్యతిరేకతను తేటతెల్లం చేస్తుందన్నారు. ఇటీవల వక్ఫ్ బోర్డు చట్టంలో సవరణలు చేయడానికి ప్రయత్నించడాన్ని దేశ ప్రజలు ఐక్యంగా తిరస్కరించారని చెప్పారు. దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టకుంటే ప్రజలు ఆందోళన బాట పడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఎర్రిబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి అభాగ్యుడు

సీతమ్మధార: ఆశీలమెట్ట ఫ్లైఓవర్ దిగువ అటు ఇటు తిరుగుతూ, రోడ్డుపై దాతలు వితరణ చేసే ఆహారం తింటూ బతికే మానసిక రోగిని ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసి షెల్టర్‌కు తరలించాలని గతంలో ఎన్నో సార్లు ప్రయత్నించారు. కానీ అతను సహకరించలేదు. అతను కరోనా ముందు నుండి అదే ప్రాంతంలో సంచరిస్తున్నాడు. ఎవరితోనూ మాట్లాడడు. ఈ నేపథ్యంలో అతన్ని శనివారం పట్టుకుని షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. అక్కడ స్నానం చేయించి, బట్టలు మార్చి, శ్రద్ధా బృందం ద్వారా అతనికి చికిత్స ప్రారంభించారు. ఈ రెస్క్యూలో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, సైక్రియాట్రిస్ట్ డాక్టర్ శ్రావణి, శ్రద్ధా సోషల్ వర్కర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి



పోప్‌కు నివాళులర్పిస్తున్న విశ్రాంత అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్, పలువురు ఫాదర్లు

దాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల విశాఖ అగ్రపీఠం కార్యాలయంలో శనివారం విశ్వ శ్రీసభ సంఘ కాపరి పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ యావత్ క్రైస్తవ లోకానికి మార్గ చూపరి పోప్ ఫ్రాన్సిస్‌గా పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికి దేవుని సేవకుడు అయిన పోప్ ఫ్రాన్సిస్ మరణ వార్త విషాదం నింపిందన్నారు. విశ్వవ్యాప్తంగా ఆయన ఎన్నో సేవలందించారని, దేవుని సేవకుడిగా, దైవ వారసుడిగా ఆయన సువార్త సేవలు అమోఘమని కొనియాడారు. 88 ఏళ్ల వయస్సులో కూడా దైవ సేవ చేస్తూ, దైవ సన్నిధానానికి చేరిన గొప్ప వ్యక్తి అని కొనియడాడారు. 11 ఏళ్ల పోప్‌గా శాంతి సందేశాలు అందించారని చెప్పారు. అనంతరం పునీత ఆంథోనీ చర్చిలో ప్రత్యేక దివ్య బలిపూజను పదుల సంఖ్యలో నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, దుగ్గంపూడి బాలశౌరి, జయరాజు, రత్నకుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతాదళాలు అప్రమత్తం



రైల్వేస్టేషన్ బయట ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో భద్రతా దళాలను కట్టుదిట్టం చేశారు. భద్రతను పెంపొందించి, ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడి సందర్భంగా కేంద్రం దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్, వాల్తేర్ డివిజన్ పరిధిలో గల విజయనగరం, శ్రీకాకుళం రోడ్, రాయగడ, జగదల్‌పూర్, లక్ష్మీపూర్ రోడ్, కోరాపుట్ వంటి పలు ముఖ్య స్టేషన్లలో భద్రతను పెంచారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. వీరితో పాటు వాల్తేర్ డివిజన్ కమర్షియల్ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ ప్రతి ప్రయాణికుడి టికెట్ తనిఖీ చేసి, సరైన టికెట్ ఉంటేనే స్టేషన్‌లోకి అనుమతిస్తున్నారు.

ఉర్సాకు కేటాయించిన భూములు రద్దు చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

దాబాగార్డెన్స్: విశాఖలో 60 ఎకరాల భూమిని ఉర్సా ఐటీ కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం తీవ్రంగా ఖండించారు. ఇది బోగస్ కంపెనీ అని తక్షణమే కేటాయించిన ఈ భూమిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడితో కలిసి మాట్లాడారు. ఐటీ ఉద్యోగాల కల్పన పేరిట విశాఖలో అత్యంత విలువైన కొండల్ని, ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఐటీ సంస్థలకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. గత 15 ఏళ్లుగా ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు చూపించి భూములు కాజేస్తున్నారన్నారు. విశాఖపట్నం హిల్ నంబర్–3లో మూడున్నర ఎకరాలు, కాపులుప్పాడలో యాభైన్నర ఎకరాల భూమిని ఐటీ కంపెనీలకు కేటాయించిందన్నారు. ఉద్యోగాలు కల్పించని కంపెనీలకు, రిజిస్ట్రేషన్ లేని కంపెనీలకు, రెండు నెలల కిందటే రిజిస్ట్రేషన్ అయిన ఉర్సా కంపెనీకి కారుచౌకగా భూములు ధారాదత్తం చేయడమంటే భూములు కాజేయడమేనన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.4 కోట్ల విలువ ఉందని, సుమారు 250 కోట్ల వరకు ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రుషికొండ భూములను టీసీఎస్‌కు ఎకరం 99 పైసలకే కట్టబెట్టిందని, కోట్ల రూపాయల విలువ కలిగిన భూములు కారుచౌకగా ఎందుకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. ఈ కంపెనీలతో చేసుకున్న ఎంవోయూలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లూలూ కంపెనీ, ఆదానీ డేటా సెంటర్ వంటి వాటికి కారుచౌకగా ప్రభుత్వ స్థలాలు అప్పగిస్తుందని విమర్శించారు.

సీఎం పర్యటన ప్రశాంతం



సీఎం పర్యటనను పరిశీలిస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం నగర పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పక్కా ప్రణాళిక చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటించిన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం ఏర్పడకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టారు. స్నిఫర్ డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్లతో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, రహదారుల తనిఖీ చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటన మొత్తం స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా ముగిసేలా బందోబస్తు నిర్వహించారు.

గాజువాక కోర్టుల సముదాయంలో వసతులపై ఆరా

గాజువాక: విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు శనివారం గాజువాక కోర్టు సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు భవనాల స్థితిగతులను పరిశీలించారు. కోర్టు భవనాల్లో అదనపు సౌకర్యాల కోసం ఆర్ అండ్ బీ అధికారులకు నివేదిక పంపించాలని సూచించారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గాజువాక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.షణ్ముఖరావు, కె.కవిత, ఎం.వి.శేషమ్మ, యార్లగడ్డ శ్రీలక్ష్మి, వి. పల్లవి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి, ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తి చేశారు. కావాల్సిన సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, దివ్యాంగుల పథకాల అమలు ప్రతి శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణలో జరగాలని సూచించారు. దివ్యాంగుల పిల్లలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, వారు అన్ని ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజనల్, మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడారు.

ఉగ్రదాడి అమానుషం



డైమండ్ పార్కు వద్ద నిరసన తెలుపుతున్న ప్లైవుడ్, గ్లాస్ అండ్ లామినేట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సీతమ్మధార: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా విశాఖపట్నం ప్లైవుడ్, గ్లాస్ అండ్ లామినేట్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దుకాణాలు బంద్ చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. శంకరమఠం రోడ్డు శాంతిపురం హైవే జంక్షన్ నుంచి డైమండ్ పార్క్ వరకు వందలాది మంది ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. పాక్ దుందుడుకు చర్యలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా దేశ ప్రజల మద్దతు ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధి వినీత్ కుమార్ జైన్ అన్నారు. టెర్రరిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజు, రాజేష్ పాటిల్, భూపెన్, శ్రవణ్, విష్ణు, చిరంజీవి, మిల్లెన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ..



మృతులకు నివాళులర్పిస్తున్న ఇండియన్ నేవీ సివిలియన్ ఉద్యోగులు

దాబాగార్డెన్స్: ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం నేవల్ డాక్‌యార్డ్‌లో పెహల్గాం మృతులకు కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన చంద్రమౌళికి సంతాపం ప్రకటించి కొద్ది సేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పుట్టా విద్యాసాగర్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కేంద్ర ప్రభుత్వం మట్టుపెట్టాలని డిమాండ్ చేశారు. అమాయక పర్యాటకుల ప్రాణాల్ని తీసిన ఉగ్ర చర్యల్ని బీఎంఎస్ ఖండిస్తుందన్నారు. ఐఎన్‌సీఎంఎస్ మజ్దూర్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతాడ రమణ, కోశాధికారి పి. సురేష్, అల్లిపిల్లి నరసింహరాజు, పంపా రవికుమార్, యోగిత, జగదీష్, ఎం. శ్రీనివాసరావు, బి. లక్ష్మణరావు, బండారు శివ కాశీబాబు, అధిక సంఖ్యలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మెగా క్యాంపస్ డ్రైవ్‌లో ఆదిత్య విద్యార్థుల సత్తా

దాబాగార్డెన్స్: ఆదిత్య డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల నిర్వహించిన మెగా క్యాంపస్ డ్రైవ్‌లో ఆ కళాశాల మూడో సంవత్సరం చదువుతున్న 950 మంది విద్యార్థినులు ఉద్యోగావకాశాలు పొందారు. ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలైన డిలాయిట్, టీసీఎస్ (ఐటీ) కంపెనీ, కాగ్నిజెంట్, జన్పాక్ట్, ఇన్ సెన్షిట్ కంప్యూటర్ సొల్యూషన్స్, ఇన్ఫోసిస్, విప్రో, మిరాకిల్, ఐఎల్ఎం, ఏడీపీతో పాటు మరెన్నో కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మెగా క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న వారిలో 97 శాతం మంది విద్యార్థినులు పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ఉత్తరాంధ్ర రీజినల్ డైరెక్టర్ పి. రామకృష్ణారెడ్డి, నోడల్ ఆఫీసర్ ఎన్. వెంకట్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ట్రైలర్ మేకింగ్‌లో అన్వేష్‌కు 6వ స్థానం



అన్వేష్‌ను సత్కరిస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

దాబాగార్డెన్స్ : ముంబైలో వచ్చే నెల 1 నుంచి 4 వరకు జరిగే వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్‌లో ట్రైలర్ మేకింగ్ పోటీలో విశాఖకు చెందిన నిష్టల అన్వేష్ టాప్–20లో 6వ స్థానంలో నిలిచాడు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అభినందన సభలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అన్వేష్ రూపొందించిన 'గన్స్ అండ్ గులాబీ' ట్రైలర్‌కు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 30న ముంబైలో అవార్డు ప్రదానం చేయనున్నారు. అన్వేష్ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి కావడం విశేషమని శ్రీనుబాబు అన్నారు. ఈ సందర్భంగా అన్వేష్‌ను సత్కరించారు.